


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని...



2లో


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 152 పేజీలు - 04 వెల - 05/-

సోమవారం 01/06/2026


## ఫైనల్లో గుజరాత్‌పై ఆర్సీబీ ఘన విజయం

ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం





- రెండోసారి ఐపీఎల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
- అజేయ అర్ధశతకంతో (75రి) జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ
- తొలుత గుజరాత్‌ను 155 పరుగులకే కట్టడి చేసిన ఆర్సీబీ బౌలర్లు
- సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి ఆర్సీబీకి ఘనమైన విజయాన్ని అందించిన కోహ్లీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి అదిరిపోయే ఆరంభం లభించింది.

మిగతా 2లో

## గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి:డీసీపీ

గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర

● ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు ● నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి ● ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు ● మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన

2



హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు.డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది.

## 70 ఏళ్ల శకం ముగిసింది.. ముంబైలో మూతపడిన ఎయిర్ ఇండియా కాలనీలు!

2



- ముంబైలోని చారిత్రక ఎయిర్ ఇండియా కాలనీలను ఖాళీ చేసిన ఉద్యోగులు
- 70 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ కాలనీలు 184 ఎకరాల్లో విస్తరణ
- ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ తర్వాత సుదీర్ఘ న్యాయపోరాటంలో ఉద్యోగుల ఓటమి
- పృథ్వీ షా, యశస్వి జైస్వాల్ వంటి క్రికెటర్లు ఈ కాలనీ మైదానాల్లోనే ఎదిగిన వైనం
- ఈ భూమిని ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్‌కు అప్పగింత

దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా పుట్టిన నగరంలో ఆ సంస్థకు చెందిన చివరి ఆనవాళ్లు కూడా కనుమరుగవుతున్నాయి. ముంబైలోని

## బెంగాల్‌లో ఉద్రిక్తత... అభిషేక్ బెనర్జీ తర్వాత మరో టీఎంసీ ఎంపీపై దాడి!

2



- హుగ్లీ జిల్లాలో ఎంపీ కల్యాణ్ బెనర్జీపై చేయిచేసుకున్న జనం
- 'దొంగ దొంగ' నినాదాలతో వెల్లువెత్తిన నిరసన
- అభిషేక్ బెనర్జీ ఘటన మరుసటి రోజే మరో దాడి

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలపై దాడులు కలకలం రేపుతున్నాయి. పార్టీలో కీలక నేత అభిషేక్ బెనర్జీపై దాడి జరిగిన మరుసటి రోజే, ఈ ఉదయం మరో ఎంపీ సొంత నియోజకవర్గంలోనే దాడికి గురయ్యారు.

## ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు... అధికారికంగా ప్రకటించాలి

● రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలన్న కవిత ● రైతు డిస్కం పేరుతో మిగతా డిస్కంలను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపణ ● ఈ ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరిక



రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె మండిపడ్డారు.రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు.

మిగతాది 2లో

## నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం..

ఆమరణ దీక్ష చేస్తానంటూ ప్రభుత్వానికి షర్మిల హెచ్చరిక



● నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల ఆగ్రహం ● ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపేనని ఆరోపణ ● పోలీసులు చూస్తూ ఉన్నా దాడిని ఆపలేదని విమర్శ ● విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరిక

మిగతాది 2లో

## విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు..

విశాఖపట్నం-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు వస్తుందన్న మాధవ్



2

● కేవలం గంటన్నరలోనే 350 కిలోమీటర్ల ప్రయాణం ● కేంద్ర మంత్రి చెప్పారని వెల్లడించిన ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ ● ప్రాజెక్టు సర్వే కోసం రైల్వే బోర్డుకు అధికారుల ప్రతిపాదన ● రేపటి నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్

ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగానికి సంబంధించి ఒక శుభవార్త వెలువడింది. విశాఖపట్నం–విజయవాడ నగరాల మధ్య బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును తీసుకురానున్నట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తనకు ఈ విషయాన్ని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే, ఇరు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## మంత్రాలయం వద్ద విషాదం... తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



● మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు ● సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం ● గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు ● ప్రమాదం నుంచి బయటపడిన అపర్ణ

కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా

మిగతాది 2లో

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

ఆరుగురు కూలీల దుర్మరణం



- కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొట్టిన కంటైనర్ లారీ
- ఘటనాస్థలిలోనే ఆరుగురు వలస కూలీలు మృతి
- 15 మందితో ప్రయాణిస్తున్న ఆటో పూర్తిగా ధ్వంసం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి పట్టణం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి.

మిగతాది 2లో

# 70 ఏళ్ల శకం ముగిసింది.. ముంబైలో మూతపడిన ఎయిర్ ఇండియా కాలనీలు!

పుట్టిన నగరంలో ఆ సంస్థకు చెందిన చివరి ఆనవాళు కూడా కనుమరుగవుతున్నాయి. ముంబైలోని శాంతాక్రూజ్ ఈస్ట్, కలినాలో ఉన్న చారిత్రక ఎయిర్ ఇండియా ఉద్యోగుల కాలనీల 7 దశాబ్దాల శకం నేటితో (మే 31) ముగిసింది. సుదీర్ఘ పోరాటం తర్వాత, చివరి నివాసితులు కూడా ఈ కాలనీలను వీడి వెళ్లడంతో, ఒక అధ్యాయం ముగిసినట్లయింది. ఈ కాలనీల ఖాళీ ప్రక్రియ ఎయిర్ ఇండియా ప్రస్థానంలో ఒక భావోద్వేగ ఘట్టంగా నిలిచిపోయింది. 1955లో నిర్మించిన ఈ కాలనీలు దాదాపు 184 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. మొత్తం నాలుగు కాలనీలలో 106 భవనాల్లో 1,683 ఫ్లాట్లు ఉండేవి. ఒకప్పుడు వేలాది కుటుంబాలతో కళకళలాడిన ఈ ప్రాంగణంలో, చివరిగా మిగిలిన సుమారు 150 కుటుంబాలు నేడు తమ ఇళ్లను ఖాళీ చేశాయి. వీరిలో ఎక్కువ మంది ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ఉద్యోగులే. రెండు దశాబ్దాల క్రితం ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ (మీఐఏఎల్)కు లీజుకు ఇచ్చిన ఈ భూమిని ఇప్పుడు పూర్తిగా వారికి అప్పగించనున్నారు. 2022లో ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ జరిగిన తర్వాత, యాజమాన్యం ఈ కాలనీలను ఖాళీ చేయమని ఆదేశించింది. అయితే, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లు తమ సర్వీస్ కండిషన్‌లో భాగమని పేర్కొంటూ ఉద్యోగులు సుదీర్ఘ న్యాయపోరాటం చేశారు. లేబర్ కోర్టు నుంచి బాంబే హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు వరకు వెళ్లినా వారికి నిరాశే ఎదురైంది. 2025 నవంబర్ 30 నాటికి ఇళ్లు ఖాళీ చేయాలని సుప్రీంకోర్టు గడువు విధించింది. అయితే, పిల్లల చదువులకు ఆటంకం కలగకూడదనే మానవతా దృక్పథంతో, ఆ గడువును అనధికారికంగా 2026 మే 31 వరకు పొడిగించారు. ఈ కాలనీలు కేవలం నివాస సముదాయాలు మాత్రమే కాదు. ఎందరో క్రీడాకారులకు పురుడుపోసిన గడ్డ. టీమిండియా యువ సంచలనాలు పృథ్వీ షా, యశస్వి జైస్వాల్‌తో పాటు అజింక్య రహానే, శివమ్ దూబే వంటి ప్రముఖ క్రికెటర్లు ఇక్కడి క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాల్లోనే తమ నైపుణ్యాలకు పదును పెట్టారు. ఇక్కడ రెండు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు కూడా ఉండేవి. 2018 ముంబై వరదలు, కోవిడ్ సమయంలో కార్గో కార్యకలాపాలు వంటి క్లిష్ట సమయాల్లో ఇక్కడి సిబ్బంది నడుచుకుంటూ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి సేవలు అందించారు. దశాబ్దాల జ్ఞాపకాలను, తాము నాటిన చెట్లను, పిల్లల బాల్యాన్ని వదిలి వెళ్లడం చాలా బాధగా ఉందని చాలా మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నారిమన్ పాయింట్‌లోని ఐకానిక్ ఎయిర్ ఇండియా భవనాన్ని విక్రయించిన తర్వాత, ఇప్పుడు కలినా కాలనీలు కూడా చేజారడంతో ముంబైలో ఎయిర్ ఇండియాకు సంబంధించిన చివరి ప్రధాన స్థిరాస్తి కూడా దూరమైనట్లయింది.

# గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మానాయుడే కీలక వ్యక్తి: డీసీపీ

గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మానాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు.
గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి



కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.
గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మానాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి: సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు,



ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశాకే భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే ఎన్నికల్లో పోటీ చేయనని సీఎం చెప్పడం ప్రజలను మరోసారి మోసం చేయడానికేనని ఆయన ఆరోపించారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఫార్మర్స్ డిస్కం ఏర్పాటు ప్రతిపాదన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. రైతులకు కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "ఫార్మర్స్ డిస్కం అనేది రైతుల మెడకు ఉరితాడు. ఉచిత విద్యుత్‌ను పూర్తిగా ఎత్తివేయడమే దీని అంతిమ లక్ష్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సహా ఏ ఒక్క హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను రైతులు, పట్టణ ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో పరిశ్రమలు పవర్ హాలిడేలు ప్రకటించేవని, రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చి, దేశంలోనే తొలిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రొయ్యలకు మేత వేసి, పొలంలో దుక్కి దున్ని... సొంతూరులో మంత్రి నిమ్మల...

- ఆదివారం సొంతూరు అగర్తిపాలెంలో పర్యటించిన మంత్రి నిమ్మల రామానాయుడు
- సైకిల్‌పై ప్రయాణించి, తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి
- సొంత రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదల పరిశీలన
- జలజీవన్ పైప్‌లైన్ పనుల విషయంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు
- ఈ వివరాలను మంత్రి తన సోషల్ మీడియా ఖాతాలో స్వయంగా పంచుకున్న వైనం



ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం తన సెలవు దినాన్ని వినూత్నంగా గడిపారు. రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే ఆయన, కాస్త విరామం దొరకడంతో తన సొంతూరులో రైతుగా మారిపోయారు. వ్యవసాయ పనుల్లో పాల్గొని, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. ఆదివారం తెల్లవారుజామున పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి సైకిల్‌పై బయలుదేరిన రామానాయుడు, 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సొంతూరు అగర్తిపాలెం చేరుకున్నారు. అక్కడ తన రొయ్యల చెరువులో మేత వేసి, రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం వరి పొలంలోకి దిగి, ట్రాక్టర్‌తో స్వయంగా దుక్కి దున్నారు. కూలీలతో మాట్లాడారు. ఆ తర్వాత, గ్రామస్థులతో కలిసి శ్రమదానంతో అభివృద్ధి చేస్తున్న హిందూ శ్మశానవాటిక పనుల పురోగతిని సమీక్షించారు. తిరిగి పాలకొల్లుకు సైకిల్‌పై పయనం అవుతుండగా, రోడ్డు పక్కన వేస్తున్న జలజీవన్ మిషన్ పైపులైన్‌ను గమనించారు. భవిష్యత్తులో మరమ్మతుల కోసం కొత్తగా మంజూరైన సిమెంట్ రోడ్డును తవ్వాల్సిన అవసరం రాకుండా, పైప్‌లైన్‌ను పక్కగా వేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ పర్యటన వివరాలను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో సొంత వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తి, ఆనందం కలిగించింది" అని ఆయన పేర్కొన్నారు.

# ఫైనల్లో గుజరాత్‌పై ఆర్సీబీ ఘన విజయం

ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా కోహ్లీ, తన మణికట్టు మాయాజాలంతో అద్భుతమైన ఫ్లిక్స్, పుల్ షాట్లతో కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. మరోవైపు, కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32) దూకుడుగా ఆడాడు. ఈ జోడీ కేవలం 21 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఐపీఎల్ ఫైనల్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. అయితే, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో ఆర్సీబీ కాస్త నెమ్మదించింది. రజత్ పాటిదార్ (14) కొన్ని చక్కటి షాట్లు ఆడినప్పటికీ, రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పటీదార్‌ను, కృనాల్ పాండ్యా (0)ను ఔట్ చేసి మ్యాచ్‌లో ఉత్కంఠ పెంచాడు. ఈ దశలో కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ కోహ్లీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కేవలం 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని జట్టుపై ఒత్తిడిని తగ్గించాడు. టిమ్ డేవిడ్ (11) కూడా త్వరగానే ఔటయినా, కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 63 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ పట్టిన డైవింగ్ క్యాచ్‌ను రీప్లేలో బంతి నేలను తాకినట్లు తేలడంతో కోహ్లీకి లైఫ్ లభించింది. ఆ తర్వాత, అర్షద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో ఒక ఫోర్, ఒక సిక్సర్ బాది ఆర్సీబీకి ఘనవిజయాన్ని అందించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు. సీఎస్కే జట్టు 2010, 2011లో వరుసగా టైటిళ్లు గెలవగా... ముంబై ఇండియన్స్ 2019, 2020లో విజేతగా నిలిచింది. ఆర్సీబీ 2025, 2026లో టైటిళ్లు గెలిచి ఆ రెండు జట్ల సరసన చేరింది. 2025లో ఇదే స్టేడియంలో తొలి టైటిల్ గెలుచుకున్న ఆర్సీబీ.. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ తర్వాత తమ టైటిల్‌ను నిలబెట్టుకున్న మూడో జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టైటిళ్లను ఒకేసారి కలిగి ఉన్న ఏకైక ఫ్రాంచైజీగా అరుదైన ఘనత సాధించింది. క్వాలిఫయర్-1లో గెలిచిన జట్టే ట్రోఫీని గెలుచుకోవడం ఇది వరుసగా తొమ్మిదోసారి.

# విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు..

మరోవైపు, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ (దక్షిణ కోస్తా రైల్వే జోన్) రేపటి నుంచి (జూన్ 1) విశాఖపట్నం కేంద్రంగా అధికారిక కార్యకలాపాలు ప్రారంభించనుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ జోన్ సాధన కోసం బీజేపీ సుమారు 30 ఏళ్లుగా పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం విశాఖ-విజయవాడ మధ్య రైలు ప్రయాణానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, ఈ 350 కిలోమీటర్ల దూరాన్ని కేవలం గంటన్నరలోనే పూర్తి చేయవచ్చని అంచనా. ఈ రైలును తొలుత గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడపాలని, భవిష్యత్తులో వేగాన్ని మరింత పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కారిడార్ విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'ఫైనల్ లొకేషన్ సర్వే' అనుమతుల కోసం క్షేత్రస్థాయి అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో ఏపీ మీదుగా ఇప్పటికే మూడు వెళ్తుండగా, ఇది రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పాటు విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఈ కొత్త ప్రాజెక్టులు ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు.

# మంత్రాలయం వద్ద విషాదం.. తుంగభద్రలో ఐదుగురు గల్లంతు

పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

# ఆ విషయం చిట్‌చాట్‌లో చెప్పడం కాదు...
# అధికారికంగా ప్రకటించాలి: కవిత

రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం..

నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

# బెంగాల్‌లో ఉద్రిక్తత..

వివరాల్లోకి వెళితే.. హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కల్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తల పట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడికి ముందు కొందరు వ్యక్తులు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ 'చోర్ చోర్' (దొంగ దొంగ) అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఆయన పర్యటనలోనూ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవగా.. 'చోర్ చోర్' అంటూ నినాదాలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక టీఎంసీ నేతలపై ఒకే తరహాలో దాడులు, నిరసనలు జరగడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..
# ఆరుగురు కూలీల దుర్మరణం



వివరాల్లోకి వెళితే, పని ముగించుకుని సుమారు 15 మంది కూలీలు ఒక ఆటోలో ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి 44పై గంగోత్రి పెట్రోల్ పంప్ వద్దకు రాగానే, వేగంగా వస్తున్న ఒక కంటైనర్ లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణించడం, లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# డాక్టర్ వైయస్, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహం ను పగల గొట్ట డం దారుణం.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల లోని శ్రీనివాససెంటర్ లో ఉన్న వైయస్ విగ్రహాన్ని పగలగొట్టడం పిరికి పంధా చర్య అని టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య కాంగ్రెస్ పార్టీ నేతలు అభివర్ణించడం జరిగింది. మహా నేత రాజ శేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతగా భారత దేశం లో పేరు ప్రఖ్యాతులు పొందిన గొప్పా నాయకునిగా ప్రజల అభిమానము పొందిన మహా నేత ఇటువంటి సంఘటన జరుగడం బాధాకరం. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఈ సంఘటనకు బాధ్యులను కటినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య , చింతల మోహన్ రావు, ప్రసాద్, సలాం, హమీద్ వాసు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జూన్ 1న ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

*- వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహణ.*



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జూన్ 1వ తేదీ (సోమవారం)న జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, మండల కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమ సమయాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా సమర్పించడంతో పాటు, ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, దాఖలు చేసిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో అధికారులకు వినతులు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

# నంద్యాల నడిబొడ్డున పట్టపగలు డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తీవ్ర ఆగ్రహం .



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల నడిబొడ్డున పట్టపగలే డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఎమ్మెల్సీ భాష ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మీడియాతో మాట్లాడుతూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఇంత దారుణంగా ధ్వంసం చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. నంద్యాల నడిబొడ్డున, అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఒక వ్యక్తి బహిరంగంగా ఈ దుశ్చర్యకు పాల్పడుతుంటే ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కౌన్సిల్ మెంబెర్ రామలింగా రెడ్డి, వైసీపీ నాయకులు డా. రాకేష్ రెడ్డి, నంద్యాల ఉప అధ్యక్షులు దాల్మిల్ అమీర్, నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా వైయస్సాసిపీ అధికార ప్రతినిధి అనీల్ అమృతరాజ్, జిల్లా వైయస్సాసిపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్, వైసీపీ మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## అపరిశుభ్రంగా వీరభద్రస్వామి దేవస్థానం ఆలయ పరిసరాలు





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం నందిపల్లె గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఆలయ ప్రహరీ వద్ద తాగునీటి ట్యాంకు కూడా ఉందని, ఆ ప్రాంతాలలో చెత్తాచెదరాన్ని పడేస్తున్నారని తెలిపారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు మండిపడుతున్నారు. పరిశుభ్రంగా ఉండాల్సి దేవాలయ పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండిపోవడం పట్ల అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# డా. వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసంలో... రాజకీయ కుట్ర... కూటమి నేతల తప్పుడు ప్రచారం.

**☛నంద్యాలలో ఘోరం.. మహానేత వైఎస్సార్ విగ్రహం ధ్వంసం!**

**☛ఐదు నిమిషాల్లోనే ఫొటోలు ప్రత్యక్షం.. ఇదో ముందస్తు కుట్రా?**

**☛తప్పుడు ప్రచారాలతో డైవర్ట్ పాలిటిక్స్.. కూటమి నేతలపై వైసీపీ ఆగ్రహం!**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల శ్రీనివాస నగర్ సెంటర్‌లో తీవ్ర ఉద్రిక్తత, పెను సంచలనం చోటుచేసుకుంది! కోట్లాది మంది గుండెల్లో నిలిచిన ప్రజానేత, స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని కొందరు దుండగులు అత్యంత దారుణంగా ధ్వంసం చేశారు. ఈ ఘటన చూసి వైఎస్సార్ అభిమానులు, సామాన్య ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే.. ఈ విగ్రహ ధ్వంసం వెనుక ఒక భయంకరమైన రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి! నిజంగా ఇది యాదృచ్ఛికంగా జరిగిన ఘటనేనా? లేక కావాలనే పథకం ప్రకారం చేసిన కుట్రనా? విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేవలం ఐదు నిమిషాల్లోనే.. నిందితుడు వైసీపీ కార్యకర్త అంటూ కూటమి నేతలు, టీడీపీ నాయకులు ఫొటోలను సోషల్ మీడియాలో ఎలా వైరల్ చేశారు?



వైయస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి.

నిందితుడు వైసీపీ నాయకులతో ఉన్న పాత ఫొటోలను అంత వేగంగా బయటకు తీసి ప్రచారం చేయడం వెనుక అసలు రహస్యం ఏంటి? ఇది ముమ్మాటికీ ముందస్తు వ్యూహంతో చేసిన రాజకీయ కుట్రే అని వైసీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. తప్పు చేసింది ఎవరో తేలకముందే, పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేయకముందే.. బురదజల్లే రాజకీయాలకు తెరలేపారు. తప్పును డైవర్ట్ చేయడానికి, ప్రజల్లో వైఎస్సార్‌పై









ఉన్న అభిమానాన్ని దెబ్బతీయడానికి ఇంత నీచమైన రాజకీయాలకు ఒడిగడతారా అని సామాన్య ప్రజలు సైతం ప్రశ్నిస్తున్నారు!మహానేత విగ్రహాన్ని తాకిన ఆ చేతులు ఎవరివైనా సరే.. ఆ దుండగుడు ఎంతటి వాడైనా సరే.. చట్టం ముందు నిలబెట్టాలి. కఠినాతి కఠినంగా శిక్షించాలి. శవాల మీద పేలాలు ఏరుకునే ఇలాంటి తప్పుడు ప్రచారాలు, శవ రాజకీయాలు ఇకనైనా ఆగాలి. నంద్యాల ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలు నిజాలను, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను సమాజం ముందు నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బలిజ, కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం.

**వ్యవస్థాపకులు దండే దస్తగిరి సేవలను కొనయాడిన అతిథులు.**

**2 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాలు అందుకున్న 150 మంది విద్యార్థులు.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో బలిజ, కాపు సేవా సమితి ఆధ్వర్యంలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 పై మార్కులు, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 950 పై మార్కులు సాధించిన 150 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బలిజ, కాపు, సేవా సమితి వ్యవస్థాపకులు దండే దస్తగిరి మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ప్రోత్సహించడం సమితి ప్రధాన లక్ష్యమని, సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారమని, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరెందరికో స్ఫూర్తిని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రధాన కార్యదర్శి దండే వెంకట్ నరేష్ మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు, జంబులున్న ట్రస్ట్ ద్వారా విద్యావతి రాజారామ్ దంపతులు, ఇండస్ హాస్పిటల్ డాక్టర్ మురళి, గోల్డ్ స్మిత్ కూరాకు రవి, రావుస్ కళాశాల ప్రిన్సిపల్ సుంకయ్య, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, వ్యాపారవేత్త భవాని ప్రసాద్, మాజీ కౌన్సిలర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం, బాలకాడమీ వ్యవస్థాపకులు వ్యవస్థాపకులు ఎం.సి కొండయ్య దాతలుగా సహాయ సహకారాలు అందించారని తెలిపారు. రావుస్ కళాశాల ప్రిన్సిపల్ సుంకయ్య మాట్లాడుతూ సమితి వ్యవస్థాపకులు దండే దస్తగిరి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ ఈ రోజు అందుకుంటున్న పురస్కారం మీ విజయానికి గుర్తింపు మాత్రమే కాదు, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఒక ప్రేరణ. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా వినయం, మానవత్వం, సమాజ సేవ పట్ల నిబద్ధతను మరువకూడదని తెలిపారు. జంబులన్న ట్రస్ట్ చైర్మన్ విద్యావతి రాజారామ్ దంపతులు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో జ్ఞానం, నైపుణ్యం, మంచి వ్యక్తిత్వం కలిగిన వారే ముందుకు సాగగలరని, కాబట్టి విద్యతో పాటు మంచి విలువలను అలవరచుకుని కుటుంబానికి, సమాజానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు. ఇండస్ హాస్పిటల్ డాక్టర్ మురళి మాట్లాడుతూ బలిజ, కాపు సేవా సమితి ఎల్లప్పుడూ విద్యార్థుల అభ్యున్నతికి అండగా నిలవాలని ఇలాంటి కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు కొప్పుల సుబ్బారెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డోన్‌లో ఘనంగా ఉచిత శిక్షణ ఫెన్సింగ్ సమ్మర్ క్యాంప్ నిర్వహణ



డోన్ . మే 31. (పల్లె వెలుగు ):డోన్ పట్టణంలో నిర్వహించిన ఫెన్సింగ్ సమ్మర్ క్యాంప్ ఉచిత శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సీఐ రాకేష్ కుమార్ మరియు లెక్చరర్ యం. రామన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.సీఐ రాకేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఇంట్లో ఖాళీగా ఉండడం వల్ల మొబైల్ ఫోన్లకు అలవాటు పడుతున్నారని, అందువల్ల వారిని క్రీడల వైపు ప్రోత్సహించి గ్రౌండ్‌లో సమయం గడిపేలా చూడాలని సూచించారు. దీని ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వత, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు.లెక్చరర్ యం. రామన్న మాట్లాడుతూ చిన్నారులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరిపక్వత పెరిగి, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరని అన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణా కార్యక్రమంలో కోచ్ దత్త మునిస్వామి విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించి విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు డోన్ పట్టణ ప్రజలు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఇటీవల నిర్వహించిన ఫెన్సింగ్ స్కేటింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, అశోక్, మధుశేఖర్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మామిడి పండ్ల దిగుబడి అధికం ధర పతనం



దొర్నిపాడు మే 31 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్రంలో మామిడి తోటలు సాగుచేసిన రైతుల కు ఆశించిన రీతిలో దిగుబడి వచ్చింది కానీ ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు దిగుబడి బాగా వచ్చి గిట్టుబాటు ధరలు ఉంటే రైతులకు మంచి ఆదాయం ఉంటుంది అయితే ఈ సంవత్సరం మామిడి పంట దారాలు కట్టి మామిడి పండ్లను వేలాడదీసిన విధంగా అధిక పంట పండింది, పంట బాగా పండి గిట్టు బాటుఉన్నప్పుడు బాక్స్ మామిడి పండ్లు ధర వచ్చి సుమారు 2000 రూపాయలు ఉండేది కానీ పంట పడింది గిట్టుబాటు ధర లేకపోవడంతో కేవలం బాక్స్ 1000, 900 రూపాయలు మాత్రమే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు,కానినకాయలన్నీ గాలి వానకు నేల రాలుతున్నాయని ఆవేదనతో అంటున్నారు,మామిడితోటల్లో కాసిన విధంగా ఇంటి పెరట్లో వేసిన మామిడి చెట్లకు కూడా విరివిరిగా పంట పండింది ఈ పెరటి మామిడి చెట్టు దొర్నిపాడుమండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సాగునీటి సంఘం డిసి చైర్మన్ బొబ్బూరి చిన్న వెంకటస్వామి, గ్రామ ఉపసర్పంచ్ శిరీష దంపతుల ఇంటి ఆవరణలో వేసిన మామిడి చెట్టుకు కూడా కాయలు అధికంగా కాసినట్లు వారు తెలిపారు, ఈ చెట్టు మామిడిపండ్లు పసందుగా ఉంటాయి, అదే విధంగా కారం కూడా కమ్మగా ఉంటుందని వారు అంటున్నారు,

# పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**విజయవంతంగా 68వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం**









నంద్యాల రూరల్.మే 31 ( పల్లె వెలుగు )పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 68వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తన తండ్రి పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పదకరాల పొలంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ తరఫున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 65వ మెగా వైద్య శిబిరంలో 1000 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ మౌలాలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతుకు సంబందించిన జబ్బులకు, దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్ వరల్డ్ రికార్డు లో స్థానం సాధించిన భవతి.



నంద్యాల బ్యూరో . మే 31. (పల్లె వెలుగు ):నంద్యాల కు చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమార్తె సాయి భవతి ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. చిత్రకళ లో కోటేష్ ఆర్ట్ అకాడమీ లో శిక్షణ తీసుకుంటుంది.ఈ సంవత్సరం జనవరి 23 న స్వాతంత్ర సమర యోధులు సుభాష్ చంద్రబోష్ జయంతి సందర్బంగా ఆర్ట్ అకాడమీ లో 13 అంగుళాల పొడవు,10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద 0.3 ఎం. ఎం. సైజు గల కుందన్ అనే రంగు రాళ్లను క్రమంగా అతికిస్తూ 3,775 రంగురాళ్ళతో నేతాజీ చిత్రాన్ని తయారు చేసింది. ఈ చిత్రాన్ని 4 గంటల సమయంలోనే చేసింది.ఈ చిత్రాన్ని తగిన ఆధారాలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ కు మరియు మిరాకిల్ వరల్డ్ రికార్డు కు పంపడం జరిగింది. ఆయా రికార్డ్స్ ఎడిటర్స్ పరిశీలించి చాలా అద్భుతమైన రీతిలో వేసిందని సాయి భవతి కి అభినందనలు తెలుపుతూ ఎంతో ప్రతిష్టాత్మక మైన "ఇండియా బుక్ ఆఫ్ రికార్డు "సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, గుర్తింపు కార్డు, బుక్, విలువైన పెన్ను కొరియర్ ద్వారా అందుకుంది. అలాగే "మిరాకిల్ వరల్డ్ రికార్డ్ "సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, మెమంటో అందుకుంది. రెండు అరుదైన రికార్డ్స్ సాధించిన సాయిభవతికి ఆదివారం ఆర్ట్ అకాడమీలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించి సర్టిఫికెట్స్, మెమంటోస్, గోల్డ్ మెడల్స్ వారి గురువు ప్రముఖ చిత్రకారుడు కళారత్న కోటేష్ చేతుల మీదుగా అందుకుంది.ఈ సందర్బంగా కోటేష్ మాట్లాడుతూ సాయి భవతి రెండు అరుదైన రికార్డ్స్ సాధించినందులకు ఎంతో సంతోషంగా వుంది.నేతాజీ చిత్రాన్ని చాలా అద్భుతమైన రీతిలో తయారు చేసింది.హృదయ పూర్వకమైన అభినందనలు, ఆశీస్సులు తెలుపు చున్నాను.మా ఆర్ట్ అకాడమీ లో 6 సంవత్సరాల నుండి చిత్రకళలో శిక్షణ తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖనంలో 25 పైగా పతకాలు సాధించింది.ముఖ్యంగా ఇటువంటి ఆణిముత్యం మా ఆర్ట్ అకాడమీకి పంపిన వారి తల్లి దండ్రులకు హృదయ పూర్వక మైన అభినందనలు తెలుపుచున్నాను.రికార్డ్స్ హోల్డర్ సాయి భవతి మాట్లాడుతూ నేను తయారు చేసిన నేతాజీ చిత్రానికి రెండు అరుదైన రికార్డ్స్ రావడం చాలా సంతోషంగా వుంది.మంచి శిక్షణ ఇచ్చిన మా గురువు కోటేష్ కి కృతజ్ఞతలు తెలుపు చున్నానని తెలిపింది.

# వైయస్సార్ విగ్రహం ధ్వంసం ఘటన


## -- వెన్నుపోటు పార్టీ దుర్బుద్ధి బయటపడింది.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. వైయస్సార్ విగ్రహంపై దాడి జరిగిన వెంటనే, కొన్ని




రాజకీయ శక్తులు ముందస్తు ప్రణాళికతోనే బురదజల్లే కార్యక్రమానికి తెరలేపాయా అనే అనుమానాలకు బలాన్ని చేకూరుస్తూ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి:

ఆ 'రెండు నిమిషాల' వెనుక ఉన్న రహస్యమేంటి? విగ్రహంపై దాడి జరిగిందని తెలిసిన వెంటనే, కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే టీడీపీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వైస్సార్సీపీకి సంబంధించిన పాత ఫోటోలు ఎలా ప్రత్యక్షమయ్యాయి? ఇంత వేగంగా కంటెంట్ మరియు ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టడం వెనుక ఉన్న అసలు కూటమి నేతలు ఎవరు?




ఇది ముందస్తు వ్యూహంలో భాగమేనా?

**నిందితుడి రాజకీయ నేపథ్యంపై అసత్య ప్రచారం ఎందుకు?**

విగ్రహాన్ని ధ్వంసం చేసిన జంబులయ్య అనే వ్యక్తి 2019 సంవత్సరం నుండి వైస్సార్సీపీలో లేనే లేడు. అయినా సరే, అతను వైస్సార్సీపీ కార్యకర్త అంటూ పాత ఫోటోలను (2019కి ముందువి) వాడుతూ ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు? కేవలం వైస్సార్సీపీ నేతలపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు కూటమి నాయకుల అజెండా దీని వెనుక ఉందా?

మెడికల్ రిపోర్ట్‌లో 'సెప్టెంబర్ 2026' -- ఫేక్ రిపోర్ట్ గుట్టు రట్టయిందా? నంద్యాలలోని 'సంజీవని క్లినిక్' లో జంబులయ్యకు వైద్య పరీక్షలు చేయించినట్లు చూపుతున్న మెడికల్ రిపోర్ట్‌లో డేట్ లిలి"29 సెప్టెంబర్ 2026" అని ఉండటం అందరినీ విస్తుపోయేలా చేస్తోంది. ప్రస్తుతం మనం మే 2026 లో ఉంటే, ఇంకా రాబోయే సెప్టెంబర్ నెల డేట్ ఆ రిపోర్ట్‌లో ఎలా వచ్చింది? అనుమానం: భవిష్యత్తు తేదీతో ఉన్న ఈ మెడికల్ రిపోర్ట్‌ను చూస్తే... ఇదంతా ముందస్తుగా ప్రిపేర్ చేసిన ఒక పెద్ద స్క్రిప్ట్ అని స్పష్టం కావడం లేదా? సోషల్ మీడియాలో ఈ తప్పును గమనించి వెంటనే ఆ రిపోర్టును ఎందుకు డిలీట్ చేశారు? పోలీసుల విచారణపై తలెత్తుతున్న ప్రశ్నలు?

ఈ మొత్తం వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నట్లు ప్రచారంలో ఉన్న లి'వందన బార్'లి పై పోలీసులు ఇప్పటివరకు ఎందుకు కేసు నమోదు చేయలేదు? అసలు నిందితుడు జంబులయ్య యొక్క కాల్ డేటా ను పోలీసులు ఎందుకు పూర్తిగా ట్రాక్ చేయడం లేదు? అతని కాల్ హిస్టరీ తీస్తే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తేలిపోతుంది కదా? విగ్రహం ధ్వంసం కావడం దురదృష్టకరం, కానీ ఆ ఘటనను ఆసరాగా చేసుకుని పాత ఫోటోలతో, భవిష్యత్తు డేట్లతో ఉన్న ఫేక్ మెడికల్ రిపోర్టులతో క్షణాల వ్యవధిలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ప్రారంభించడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు ఈ ప్రశ్నల ద్వారా స్పష్టమవుతున్నాయి.

## టిడిపి పార్టీ మరియు చంద్రబాబు వీర విధేయులు

# టిడి జనార్ధన్ రాజ్యసభ సీటు ఇవ్వాలి.

**విజ్ఞప్తి చేసిన నూర్ అహ్మద్, యం హెచ్ పి యస్ రాష్ట్ర కార్యదర్శి.**






ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీకి అన్ని కాలాల్లోనూ ఒక సైనికుడిగా పని చేస్తూ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని కష్టనష్టాలను అనుభవించినా కూడా పార్టీ పట్ల విశ్వాసం విధేయత తగ్గని గొప్ప నాయకుడు మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ రాజ్యసభకు పంపడం ద్వారా తెలుగుదేశం పార్టీ మరియు తెలుగు ప్రజల వాణిని బలంగా వినిపించడం సాధ్యం అవుతుందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మనవి చేసుకుంటున్నాను, ఎల్లప్పుడూ పార్టీని అంటిపెట్టుకుని ఉంటూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మరియు పార్టీ కార్యకర్తలకు అనుసంధానంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి అలుపెరగని కృషి చేస్తున్న టిడి జనార్ధన్ రాజ్యసభ సీటు ఇవ్వడం ద్వారా పార్టీకోసం కష్టపడే కార్యకర్తలకు నాయకులకు పార్టీ అందలం ఎక్కిస్తుందనే సందేశం ఇవ్వగలిగితే పార్టీ బలోపేతం అవుతుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని వీడని టిడి జనార్ధన్ పార్టీ పట్ల చూపిన ప్రేమ అద్భుతం.పార్టీ వ్యవస్థాపకులు కీర్తి శేషులు నందమూరి తారక రామారావు జీవిత చరిత్రను సాహిత్య రూపంలో ప్రపంచంలో పదుల కొద్ది దేశాల్లో ప్రచారం చేస్తూండటంతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న టిడిపి పార్టీ భావజాలం ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడానికి టిడి జనార్ధన్ కృషి చేయడం మరో ఎత్తు. కావున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ కోసం ప్రాణం పెట్టి పని చేస్తున్న టిడి జనార్ధన్ రాజ్యసభ సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# విద్య వల్లే సమాజంలో గుర్తింపు




బండి ఆత్మకూరు పల్లె వెలుగు మే 31: విద్య వల్లే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మార్పీఎస్ బండి ఆత్మకూరు మండల కో ఇన్చార్జి శివకుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఇన్చార్జి, జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు సూచనలతో బండి ఆత్మకూరు ఎస్సీ కాలనీలో గో టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో యించార్జి శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలంటే విద్య ఒక్కటే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. మాదిగ పల్లెల్లో ప్రతిబిడ్డ ఐదు సంవత్సరాలు నిండగానే పాఠశాలలో చేరాలని, ఇందుకు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంకా పై చదువులు చదవాలని, విద్యను మధ్యలో ఆపివేయకుండా డిగ్రీలు పీజీలు పీహెచ్డీ ల వరకు కొనసాగాలని పేర్కొన్నారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి సురేష్, దశరధుడు, వెంకటయ్య, నందయ్య ,నాగేంద్ర, బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యుత్ ట్రాన్స్కో కు కోటి నష్టం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు మే 31 : బండి ఆత్మకూరు మండలంలో రెండు రోజుల క్రితం గాలివాన సృష్టించిన బీభత్సం కారణంగా విద్యుత్ ట్రాన్స్కోకు కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా విషమని అసిస్టెంట్ ఇంజనీర్ కంబగిరి ఆదివారం సాయంత్రం తెలిపారు. మండలంలో గాలివాన కారణంగా అధికంగా స్తంభాలు విరిగిపోయాయని ఆయన తెలిపారు. 33 కెవి స్తంభాలు 8, 11 కేవీ స్తంభాలు 42,ఎల్టి స్తంభాలు 60 దాకా దెబ్బతిన్నాయని గుర్తించడం జరిగింది అని తెలిపారు బి కోడూరు లెవెన్ కె.వి లో నాలుగు స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. కడమల కాల్వ, ఈర్నపాడు,వెంగల్ రెడ్డి పేట గ్రామాలలో డి టి ఆర్ ట్రాన్స్ఫారములు దెబ్బతిన్నట్లుగా గుర్తించడం జరిగింది. ఈర్నపాడు ఏ కోడూరు తదితర గ్రామాల లో సిబ్బంది సహకారంతో యుద్ధప్రాతికపదిన, స్తంభాలను ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరా నువ్వు పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి స్తంభాలు కూడా చాలా చోట్ల దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో త్వరలోనే స్తంభాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# టీడీపీ నాయకుడు పెద్ద రామన్న కన్నుమూత



హోళగుంద పల్లె వెలుగు మే 31 గజ్జహల్లి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు చాకలి పెద్ద రామన్న ఆకస్మికంగా మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆయన మరణవార్త తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ గ్రామంలో టీడీపీ బలోపేతానికి కృషి చేసిన పెద్ద రామన్న సేవలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ముల్ల నబీరాసుల్, పూజారి రామలింగ, ఆరుబోట్ల గిరిమల్ల తదితరులు మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మనిషి విలువ పెరగాలంటే?

పల్లె వెలుగు: మనిషి ఆలోచనే అతని వ్యక్తిత్వానికి ప్రతిబింబం. మనిషి ధనం కన్నా గుణం మిన్న. సిరిసంపదలను చూసి ఇచ్చే విలువ నీటిమీద బుడగలాంటిది. అది క్షణకాలంలో కరిగిపోతుంది. కానీ సద్గుణ సంపదను చూసి ఇచ్చే విలువ, గౌరవం శాశ్వత కీర్తిశిఖరంగా నిలిచిపోతుంది. పలికే మాటల్లో నిజాయితీ, చేతల్లో నమ్మకం ఉంటే సమాజంలో విశ్వసనీయత పెరుగుతుంది. నీవు చేసే నిస్వార్థ సేవ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. సమాజానికి స్ఫూర్తిగా మారుతుంది. అహంకారం, మదాన్ని విడిచిపెట్టి అందరిలో నీ ప్రతిష్ఠను పెంచుకో. ఆర్తులను, ఆపన్నులను ఆదరించి బతికితే నీ జీవితం చరితార్థమవుతుంది. ఆత్మగౌరవం నీ భూషణమైతే సమాజంలో నిజమైన మానవీయత వర్ధిల్లుతుంది. కోపం వద్దు... ఓపికే ముద్దు. ఉన్నత స్థాయి ఆలోచనలతో ఉత్తమ వ్యక్తిగా ఎదగాలి. సత్సంకల్పంతో నిరంతరం శ్రమిస్తే నీవు లక్ష్యాన్ని చేరుకుంటావు. గమ్యాన్ని ముద్దాడుతావు. విజయం నిన్ను వరిస్తుంది. ఆడంబరాలు వద్దు. అంకితభావం నీ హద్దుగా ఉండాలి. అభివృద్ధి నీ పథంగా మారాలి. చైతన్యం నీ బాటైతే ప్రగతి, పురోగతి పరిఢవిల్లి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పునర్జీవనం వికసిస్తుంది. మంచితనం, మానవత్వమే నిజమైన విలువలు. మంచితనాన్ని పెంచు, మంచితనాన్ని పంచు. మనిషిగా నిలిచిపో. చీకటిని పారద్రోలి వెలుగుదివ్వెవై నిలిచిపో. -- నేదునూరి కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం కాలమిస్ట్, రచయిత కరీంనగర్.

# వైఎస్సార్ విగ్రహ ధ్వంసం దారుణం,సిపిఐ తీవ్ర ఖండన.

దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలి. సిపిఐ .




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వికృత చేష్టను సిపిఐ తీవ్రంగా ఖండించింది. ప్రజాదరణ పొందిన ఒక దివంగత నాయకుడి విగ్రహాన్ని నడిరోడ్డుపై పగలగొడుతుంటే రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోందని సిపిఐ నాయకులు ప్రశ్నించారు. ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం కనీసం నోరు వి ప్ ్ర క్ ఏో వ డ్ ం శోచనీయమన్నారు. ఈ దారుణ ఘటనపై సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫకృద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. నంద్యాల ప్రాంతంలో ఎంతో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని, గతంలో ఎన్నడూ ఇలాంటి దుశ్చర్యలు జరగలేదని వారు గుర్తుచేశారు. రాజకీయ విద్వేషాలతో విగ్రహాలను ధ్వంసం చేసే వికృత సంస్కృతి నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగిస్తోందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
?పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున విగ్రహ ధ్వంసం జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా, పోలీస్ ఉన్నతాధికారులు కనీసం ఘటనా స్థలానికి వచ్చి సమీక్షించకపోవడంపై సిపిఐ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసమై గంటలు గడుస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడలేదని, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ఆదివారం ఉదయం శ్రీనివాస సెంటర్ లో విగ్రహాన్ని పగలగొట్టిన వ్యక్తితో పాటు, ఈ దారుణానికి వెనుక ఉండి నడిపించిన అసలు సూత్రధారులు ఎవరనేది పోలీసులు తేల్చాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది. ఎంతటి వారైనా సరే చట్టం ముందు నిలబెట్టాలని, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసు శాఖను డిమాండ్ చేశారు.

# టెన్త్, ఇంటర్ ఫలితాలే భవిష్యత్ జీవితానికి పునాది.

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్
- ప్రతిభావంతులైన పోలీసుల పిల్లలకు ఎస్పీ అభినందనలు.
- ఇంటర్, టెన్త్ లలో 95 శాతం మెరిట్ సాధించిన పోలీసు కుటుంబాల విద్యార్థులకు అభినందన పత్రాలు, బహుమతులు అందజేసిన ఎస్పీ.
- నిరంతరం కష్టపడి చదివితే విజయాలు సాధ్యం విద్యార్థులకు ఎస్పీ సందేశం.
























ఆదోని (పల్లె వెలుగు): 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు కుటుంబాల విద్యార్థులను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో అభినందించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులను, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను గుర్తిస్తూ అభినందన పత్రాలు మరియు ఫాస్ట్‌ట్రాక్ వాచ్‌లను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశలన్నారు. ఈ స్థాయిలో సాధించిన ఫలితాలే భవిష్యత్తులో ఇంజినీరింగ్, మెడిసిన్, సివిల్ సర్వీసెస్, ఉపాధ్యాయులుగా తదితర రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కష్టపడి చదవడం, లక్ష్యసాధన కోసం నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం విజయానికి ప్రధాన కారణాలని తెలిపారు. టెన్త్, ఇంటర్ తర్వాత కూడా నిర్లక్ష్యం చేయకుండా ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్య ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని, ఉన్నత విద్యాభ్యాసంతో పాటు మంచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్, మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో రాణించి జిల్లా కు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. సివిల్, ఏఆర్, హోంగార్డు విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు, విద్యార్థినులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు జె.బాబు ప్రసాద్, వెంకట్రామయ్య,ఉపేంద్రబాబు భార్గవి, సీఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, పోలీసు కుటుంబ సభ్యులు ఉన్నారు.

# వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై వైఎస్ఆర్ శాంతియుత నిరసన.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్‌లో దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసం చేయబడిన ఘటన కలకలం రేపింది. నంద్యాల మాజీ శాసనసభ్యుడు శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, జిల్లా పార్టీ ఇంచార్జ్ కాటసాని రాంభూపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులతో కలిసి శాంతియుతంగా నిరసన కార్యక్రమంలో నిర్వహించారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలను అవమానించే విధంగా జరిగిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాము అని రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ, ప్రజానాయకుల విగ్రహాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

# కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు




కాకినాడ,పల్లె వెలుగు ఆదివారం మే 31 :- కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారానికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ జానపద కళాకారులు మేడిశెట్టి శ్రీరాములు, డిఆర్డిఎ కమ్యూనికేషన్ స్కిల్స్ నిపుణులు ఎం. సత్యబాల పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మేడిశెట్టి శ్రీరాములు జానపద గేయాల విశిష్టతను వివరిస్తూ, వాటి ద్వారా సంస్కృతి, సాంప్రదాయాలు, మానవతా విలువలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు జానపద గీతాలను ఆలపిస్తూ, వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఎం. సత్యబాల విద్యార్థులకు కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాముఖ్యతపై దిశానిర్దేశం చేశారు. వేదికపై మాట్లాడే ధైర్యం, భావ వ్యక్తీకరణ, స్పష్టమైన ఉచ్చారణ వంటి అంశాలపై మెలకువలు నేర్పారు. విద్యార్థులను సమూహాలుగా విభజించి వారి ప్రతిభను వెలికితీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్చార్జ్ ఉప గ్రంథాలయాధికారి కె. కిషోర్, సిబ్బంది ఏవీఎస్ నాగేంద్ర కుమార్, టి. వీర్రాజు, ఎన్వీఎస్ ఫణీంద్ర కుమార్, జి. దుర్గాప్రసాద్, వి. అరుణ మరియు 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు

# సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమండ్రి,పల్లె వెలుగు ఆదివారం మే 31 :- ప్రజల సమస్యల వేగవంతమైన పరిష్కారం కోసం జూన్ 1వ తేదీ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పరిపాలన అధికారులు, మండల స్థాయిలో తహశీల్దార్లు మరియు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజల వినతులను స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని కార్యాలయాల్లో నేరుగా అర్జీలు సమర్పించుకోవచ్చని ఆమె సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేయడానికి ఎవవసెశీయిఎ.ఖజూ.ప్ర్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను, టోల్ ఫ్రీ నంబర్ 1100ను మరియు వాట్సాప్ గవర్నెన్స్ సేవల కోసం 95523 00009 నంబరును ఉపయోగించుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు

# వైద్య వ్యాపారీకరణ మంటగలుస్తున్న మానవత్వం

పల్లె వెలుగు:ఆధునిక సమాజంలో వైద్యరంగం తన మానవీయ కోణాన్ని కోల్పోయి, లాభార్జనే పరమావధిగా సాగుతున్న వ్యాపారంగా మారడం అత్యంత దురదృష్టకరం.ఒకప్పుడు "హిప్పోక్రటీస్ ప్రమాణం" సాక్షిగా, కులమతాలకు, ఆర్థిక స్థితిగతులకు అతీతంగా ప్రాణరక్షణే ఏకైక లక్ష్యంగా సాగిన పవిత్ర వైద్యవృత్తి, నేడు కార్పొరేట్ శక్తులు, బీమా కంపెనీలు, ఔషధ దిగ్గజాల లాభాపేక్ష మధ్య నలిగిపోతోంది.ఈధనవ్యామోహం వల్ల ఆరోగ్యం అనేది పౌరుడి "ప్రాథమిక హక్కు" స్థాయి నుండి, కొనుగోలుచేయాల్సిన''విలాసవంతమైన వస్తువు"గా దిగజారింది.ఫలితంగా సమాజంలో ఆరోగ్య అసమానతలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. వ్యవస్థాగత లోపాలు -- వ్యాపారీకరణకు ప్రధాన కారణాలు:వైద్యరంగం ఈ స్థాయిలో వాణిజ్యమయం కావడానికి కేవలం ఆసుపత్రులే కాదు, సమాజంలోని వ్యవస్థాగత లోపాలు కూడా కారణం. ప్రైవేటీకరణ పడగలు:ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వాలు క్రమంగా విస్మరించి, ప్రైవేట్ రంగానికి పగ్గాలు అప్పగించడం ప్రధాన లోపం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, నిపుణులైన వైద్యుల కొరత వల్ల సామాన్యుడు సైతం అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కమీషన్ల సంస్కృతి లక్ష్యాలులి:అత్యాధునిక సాంకేతికత (ఎమ్ఆర్ఐ, సిటి స్కాన్లు) పేరిట నేడు రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు.కార్పొరేట్ యాజమాన్యాలు వైద్యులకు నెలవారీ లక్ష్యాలు విధించడంతో, అనవసర ల్యాబ్ పరీక్షలు, మితిమీరిన ఔషధాల సిఫార్సులు, అవసరం లేకున్నా ఐసియూ బెడ్లపై ఉంచడం సర్వసాధారణమైంది.చిన్న ఆసుపత్రుల నుండి బహుళజాతి కార్పొరేట్ వైద్యశాలల వరకు 'లాభమే' ప్రథమ ప్రాధాన్యమైంది.

**వైద్య విద్య వ్యయాలు:**

నేడు ప్రైవేట్ కళాశాలల్లో వైద్య విద్య (ఎంబీబీఎస్, ఎండీ) అభ్యసించాలంటే కోట్లాది రూపాయల విరాళాలు, శుల్కాలు చెల్లించాల్సి వస్తోంది. అంత పెట్టుబడి పెట్టి చదివిన అభ్యర్థులు, వృత్తిలోకి రాగానే ఆ మొత్తాన్ని వసూలు చేసుకోవాలనే ఒత్తిడితో వ్యాపార ధోరణిని అలవరచుకుంటున్నారు.

**ఫార్మా - డాక్టర్ నెట్‌వర్క్:**

ఔషధ కంపెనీలు తమ బ్రాండ్లను ప్రచారం చేయడానికి వైద్యులకు విదేశీ పర్యటనలు, ఖరీదైన బహుమతులు అందిస్తాయి. దానికి ప్రతిఫలంగా వైద్యులు జనరిక్ మందులకు బదులు అత్యంత ఖరీదైన బ్రాండెడ్ మందులను రాయడం రోగుల పాలిట శాపంగా మారింది.

**విపత్తుల్లో దోపిడీ:**

కోవిడ్-19 సంక్షోభ సమయంలో ప్రాణవాయువు, అత్యవసర మందులు (రెమ్‌డెసివిర్), ఆసుపత్రి పడకల ధరలను ఆకాశానికంటించి, శవాల మీద పైసలు ఏరుకున్న చందంగా వ్యవహరించడం ఈ వ్యాపార మనస్తత్వానికి పరాకాష్ఠ.

సమాజంపై తీవ్ర ప్రభావం

ఈ వికృత ధోరణి వల్ల సమాజం కోలుకోలేని విధంగా దెబ్బతింటోంది:

డాక్టర్-రోగి మధ్య ఉండాల్సిన పవిత్రమైన "విశ్వాసం" నేడు కేవలం ఒక "ఆర్థిక లావాదేవీ"గా దిగజారింది. దేవుడిగా భావించాల్సిన వైద్యుడిని నేడు సమాజం ఒక వ్యాపారిగా చూసే దుస్థితి దాపురించింది.

**ఆర్థిక పతనం:**

మధ్యతరగతి, పేద కుటుంబాల్లో ఒకరికి పెద్ద జబ్బు సోకితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడుతోంది. కేవలం వైద్య ఖర్చుల వల్ల భారతదేశంలో ఏటా లక్షలాది కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోతున్నాయని నివేదికలు చెబుతున్నాయి.

**చికిత్సకు దూరం:**

ఖర్చులకు భయపడి రోగాలను దాచుకుని, చివరి దశలో ప్రాణాలు కోల్పోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు.

లినాణేనికి మరోవైపు (సానుకూల అంశాలు)లిఈ వ్యాపారీకరణ లేదా పెట్టుబడిదారీ విధానం వెనుక ఉన్న పెట్టుబడుల వల్లే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులుచోటుచేసుకున్నాయనది కూడావాస్తవం.పారిశ్రామికీకరణ వల్లే ప్రపంచ స్థాయి కార్పొరేట్ ఆసుపత్రులు, అత్యాధునిక శస్త్రచికిత్సా పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.కొత్త ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట అవయవ మార్పిడి చికిత్సలు, రోబోటిక్ సర్జరీలు, క్యాన్సర్ పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో వేగంగా విస్తరిస్తున్నాయి.

అయితే, ఈ ప్రయోజనాలు ఎంత అద్భుతంగా ఉన్నప్పటికీ, ఇవి కేవలం ధనవంతులకే పరిమితమై, సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నప్పుడు ఆ శాస్త్ర సాంకేతిక ప్రగతికి అర్థం లేదు.లిఈ దుస్థితిని మార్చే పరిష్కార మార్గాలులివైద్యరంగాన్ని మళ్లీ మానవీయ పథంలోకి తీసుకురావడానికి తక్షణమే కింది చర్యలు చేపట్టాలి:ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని, శుల్కాలను అరికట్టడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలి. చికిత్సల, ల్యాబ్ పరీక్షల ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. జిడిపిలో ప్రజారోగ్యానికి కేటాయింపులను కనీసం 3% నుండి 5%కి పెంచాలి. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి బలోపేతం చేయవచ్చు.ఆయుష్మాన్ భారత్', రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను (ఆరోగ్యశ్రీ వంటివి) మరింత బలోపేతం చేయాలి. లోపాలు లేకుండా ప్రతి పౌరుడికీ ఉచిత, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలి.జన ఔషధి' కేంద్రాలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చి, వైద్యులు కేవలం జనరిక్ పేర్లనే ప్రిస్క్రిప్షన్‌పై రాసేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. వైద్య విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వృత్తిపరమైన నైతిక విలువలను (మెడికల్ ఈతిక్స్) తప్పనిసరిగా బోధించాలి. లాభాపేక్షలేని స్వచ్ఛంద, మిషనరీ వైద్య నమూనాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.వైద్యం జీవనోపాధి కోసం చేసే వృత్తి కావచ్చు, కానీ అది మానవత్వాన్ని బలితీసుకునే క్రూర వ్యాపారంగా మారకూడదు. లాభాల మోజుతో మనుషుల ప్రాణాలను, శవాలను పణంగా పెడితే సమాజ మనుగడకే ప్రమాదం.వైద్యులను భగవంతుని స్వరూపంగా చూసే సంస్కృతి మనది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్య సమాజంపై, వ్యవస్థను చక్కదిద్దాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. కార్పొరేట్ శక్తులు విసురుతున్న "లక్షల బిల్లుల" చక్రవ్యూహం నుండి సామాన్య మానవుడు ఎప్పుడు విముక్తి పొందుతాడనేది నేటికీ మిగిలి ఉన్న మిలియన్ డాలర్ల ప్రశ్న. దీనికి సమాధానం ప్రభుత్వాల చిత్తశుద్ధిలోనే ఉంది.మీ రాము కోలా దెందుకూరు ఖమ్మం.

# అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్ మృతి.





రుద్రవరం. పల్లె వెలుగు : ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో పవన్ కుమార్ రెడ్డి ( 30) అనే వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన పవన్ కుమార్ రెడ్డి ట్రాక్టర్ తో ఆర్ కొత్తూరు సమీపంలోని గంగిరెడ్డి కుంటలో మట్టిని తీసుకొని వెళుతుండగా మార్గమధ్యలోని మాచినేనిపల్లి సమీపంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ పవన్ కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలాన్ని రుద్రవరం ఎస్ఐ జయప్ప సిబ్బందితో సందర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎర్రకోట రాజీవ్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు





ఎమ్మిగనూరు, పల్లె వెలుగు, మే 31: ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి





పుట్టినరోజు వేడుకలు ఎమ్మిగనూరు పట్టణంలో ఘనంగా, అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ సర్కిల్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి గజమాలలతో ఎర్రకోట రాజీవ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి పుట్టినరోజు వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజల సమక్షంలో మాట్లాడిన రాజీవ్ రెడ్డి తనపై చూపుతున్న ప్రేమ, ఆదరణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, పార్టీ శ్రేణులు అందిస్తున్న అపారమైన అభిమానమే తనకు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చిన ఆయన, భవిష్యత్తులో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త పునాదిగా నిలవాలని ఆకాంక్షించారు. ఎర్రకోట కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ప్రతి కార్యకర్తకు, అభిమానికి తగిన గుర్తింపు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాజీవ్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## నంద్యాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు..

# మంత్రి ఎన్ఎండి ఫరూక్ హెచ్చరిక.

**వైఎస్సార్ విగ్రహం ధ్వంసం వెనుక వైకాపా కుట్రపూరిత రాజకీయాలు : మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి.**





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్రపూరిత డ్రామాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు . ఈరోజు నంద్యాల పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో పాటు రాష్ట్ర రోడ్లు , భవనాలు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, జోనల్ 5 టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణం ఎల్లప్పుడూ ప్రశాంతతకు, మతసామరస్యానికి మారుపేరని, ఇక్కడి ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు . నంద్యాలలో చోటుచేసుకున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనపై మంత్రి స్పందిస్తూ, ఆ విగ్రహాన్ని తాము పగులగొట్టాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ విధమైన చౌకబారు విమర్శలు మరియు నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. గతంలో కోడికత్తి డ్రామాలు ఆడిన చరిత్ర వారిదేనని, ఇప్పుడు కూడా అలాంటి కుతంత్రాలనే పునరావృతం చేస్తున్నారని విమర్శించారు.

నంద్యాలలో మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నారనే అక్కసుతో, ఇక్కడి నుండి బేస్ చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులతో తాము ఇప్పటికే మాట్లాడామని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఇటువంటి పనికిమాలిన పనులు చేసే అరాచక శక్తులను మరియు దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు దూసుకుపోతోందని మంత్రి ఫరూక్ తెలిపారు . నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి అడ్డుపడే ప్రయత్నం చేశాయని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాల రీఛార్జ్ కోసం, తాగునీరు మరియు సాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తోందని, ఎండకాలంలో కూడా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని గుర్తుచేశారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి జొన్నలు, మామిడి కాయలు వంటి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. తాము ఎప్పుడూ శాంతియుత రాజకీయాలనే నమ్ముకున్నామని, సుమారు 45 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానని, ఎన్నడూ పార్టీలు మారలేదని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇటువంటి అరాచక శక్తుల ఆటలు సాగనివ్వబోమని, ప్రజలంతా వాస్తవాలను గమనిస్తున్నారని ఆయన తెలిపారు . నంద్యాల ప్రశాంతతకు భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ సందర్భంగా మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు ఉదయం నంద్యాల పట్టణంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని వైకాపా అనుచరుడే స్వయంగా ధ్వంసం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీపై నెట్టేందుకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం ప్రయత్నించాడని ఆధారాలతో సహా నిరూపించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడు 'చాకలి జంబులయ్య' అనే వ్యక్తి అని, అతను వైకాపా స్థానిక కౌన్సిలర్ మరియు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అనుచరుడనడానికి తగిన ఫోటో ఆధారాలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మీడియాకు విడుదల చేశారు. నిందితుడు జంబులయ్య, అతని భార్య వైకాపా నాయకులతో కలిసి ఉన్న ఫోటోలను సాక్ష్యాలుగా చూపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విద్వంసాలు సృష్టించడం, అల్లర్లు లేపడం కొత్తేమీ కాదని, అది వారి సంస్కృతిలోనే ఉందని మంత్రి విమర్శించారు. గతంలో అధికారంలోకి రావడానికి 'కోడికత్తి డ్రామా' ఆడారని, మొన్నటి ఎన్నికలలో జనాదరణ కోల్పోయాక సానుభూతి కోసం 'గులకరాయి నాటకం' ఆడారని గుర్తుచేశారు. చివరకు సొంత బాబాయ్ వై.ఎస్. వివేకానంద రెడ్డి ని దారుణంగా నరికి చంపించి, ఆ బ్లేమ్‌ను ఇతరులపై వేయడానికి ప్రయత్నించిన అరాచక చరిత్ర జగన్ మోహన్ రెడ్డి దని మంత్రి తెలిపారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నిరుద్యోగ నిర్మూలనపై దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేస్తుంటే, ఆ అపఖ్యాతిని కప్పిపుచ్చడానికి వైకాపా ఈ విధమైన చిల్లర రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ప్రశాంత వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదేనని, తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం ముందు సమానులేనని ఆయన అన్నారు.

# వైఎస్సార్ విగ్రహం ధ్వంసం దారుణం

**☛నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాసిం వలి**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు మే 31 ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాసిం వలి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.నంద్యాల నడిబొడ్డున శ్రీనివాస సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దురదృష్టకర ఘటన అని పేర్కొన్నారు.

పట్టపగలు విగ్రహంపై దాడి జరుగుతున్నప్పటికీ పోలీసులు వెంటనే స్పందించకపోవడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు.అనంతరం నిందితుడి మానసిక పరిస్థితిని కారణంగా చూపుతూ వివరణలు ఇవ్వడం కంటే, ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయడంపై దృష్టి పెట్టాలని సూచించారు.విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని,అతని వెనుక ఎవరైనా ప్రేరేపిత శక్తులు ఉన్నాయా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విగ్రహాల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# బీట్ రూట్ జ్యూస్‌ను అసలు రోజూ ఎంత మోతాదులో తాగాలి..?


# ఏ సమయంలో తాగితే మంచిది..?

బీట్ రూట్ మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. బీట్‌రూట్‌ను కొందరు వేపుడు చేస్తారు. కొందరు కూరగా చేసుకుని తింటే కొందరు సలాడ్ రూపంలో తింటారు. బీట్‌రూట్‌ను తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. బీట్ రూట్‌లో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. బీట్‌రూట్‌ను నేరుగా తినడం ఇష్టం లేకపోతే దాన్ని జ్యూస్‌గా చేసుకుని రోజూ తాగవచ్చు. రోజూ కనీసం 100 ఎంఎల్ మోతాదులో బీట్‌రూట్ జ్యూస్‌ను తాగితే చాలు, అనేక లాభాలు కలుగుతాయి. బీట్ రూట్ జ్యూస్‌ను సాధారణంగా ఉదయం సేవిస్తే మంచిది. దీంతో అనేక లాభాలను పొందవచ్చు. శరీరానికి పోషకాలు లభిస్తాయి. ఆరోగ్యంగా ఉంటారు. వ్యాధుల నుంచి బయట పడతారు.





**గుండె ఆరోగ్యానికి..**



బీట్ రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల శరీరానికి నైట్రేట్స్ లభించి మన శరీరంలో అవి నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. దీని వల్ల గుండె ఆరోగ్యం సైతం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. బీట్ రూట్ జ్యూస్‌ను తాగితే అందులో ఉండే నైట్రేట్స్ మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి మన శరీరంలోని కణాలకు ఆక్సిజన్ సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో కణాలకు ఆక్సిజన్ సరిగ్గా సరఫరా అవుతుంది. ఫలితంగా శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. శారీరక శ్రమ చేసేవారికి, వ్యాయామం చేసే వారికి బీట్ రూట్ జ్యూస్ ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల శరీరానికి మళ్లీ చురుకుదనం వస్తుంది. మళ్లీ ఎలాంటి అలసట లేకుండా పని చేయగలుగుతారు.

**షుగర్ సమస్యకు..**

బీట్ రూట్‌లో బీటాలెయిన్స్, ఫ్లేవనాయిడ్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి గుండె పనితీరును మెరుగు పరుస్తాయి. శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుంచి బయట పడేస్తాయి. దీని వల్ల గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బీట్ రూట్ చాలా తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక ఈ జ్యూస్‌ను తాగితే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. దీన్ని తాగడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ అదుపులో ఉంటుంది. బీట్ రూట్‌లో అధికంగా ఉండే బీటాలెయిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. వాపులకు గురికాకుండా చూస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నుంచి బయట పడవచ్చు.

**ఏ సమయంలో తాగాలి..?**

బీట్ రూట్‌లో ఉండే బీటాలెయిన్ అనే సమ్మేళనం వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. బీట్ రూట్ జ్యూస్‌ను రోజూ ఉదయం పరగడుపునే సేవించాలి. వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ చేసేవారు తమ పనులకు ఒక గంట ముందు ఈ జ్యూస్‌ను తాగితే మేలు జరుగుతుంది. బీపీ ఉన్నవారు ఈ జ్యూస్‌ను రోజుకు 200 ఎంఎల్ వరకు తాగవచ్చు. కానీ బీట్ రూట్ జ్యూస్‌ను అధికంగా సేవిస్తే విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక అలాంటి వారు ఈ జ్యూస్‌కు దూరంగా ఉండాలి. బీపీ ఉన్నవారు ఉదయం ఈ జ్యూస్‌ను సేవించాలి. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. ఇలా బీట్ రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

---

# ఎండు కొబ్బరిని తినడం వల్ల ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?

# రోజూ ఎంత మోతాదులో తినాలంటే..?

ఎండు కొబ్బరిని మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. దీంతో కూరలు చక్కని రుచి, రంగును కలిగి ఉంటాయి. ఎండు కొబ్బరిని స్వీట్ల తయారీలోనూ ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరితో తయారు చేసే స్వీట్లు ఎంతో రుచిగా ఉంటాయి. ఎండు కొబ్బరిలో అనేక ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. ఈ కొబ్బరిలో ఫైబర్, మినరల్స్ కూడా ఉంటాయి. దీని వల్ల మన శరీరానికి పోషణ లభిస్తుంది. ఎండు కొబ్బరిలో మీడియం చెయిన్ ట్రై గ్లిజరైడ్స్ (%వీజుం%) ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తాయి. రోజూ ఎండు కొబ్బరిని నేరుగా కూడా తినవచ్చు. దీంతో అనేక లాభాలను పొందవచ్చు. ఎండు కొబ్బరిని తినడం వల్ల అందులో ఉండే లారిక్ యాసిడ్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**%జీర్ణ వ్యవస్థకు..**

ఎండు కొబ్బరిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల దీన్ని తింటే రోజూ మనకు కావల్సిన ఫైబర్ సులభంగా లభిస్తుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. ఎండు కొబ్బరి ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎండుకొబ్బరిలో ఉండే ఎంసీటీలు లివర్‌లో శక్తిగా మార్చబడతాయి. కనుక దీన్ని తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. శరీర మెటబాలిజం పెరుగుతుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు, అథ్లెట్లకు మేలు జరుగుతుంది. ఎంత పనిచేసినా అలసట, నీరసం రావు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఎండు కొబ్బరిలో అనేక రకాల మినరల్స్ ఉంటాయి. ఇందులో ఉండే మాంగనీస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మెటబాలిజం పెరిగేలా చేస్తుంది.

**రక్తం వృద్ధి చెందేందుకు..**

ఎండు కొబ్బరిలో అధికంగా ఉండే కాపర్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఎర్ర రక్త కణాలు నిర్మాణం అయ్యేలా చేస్తుంది. మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఎండు కొబ్బరిలో ఉండే ఐరన్ మనల్ని ఉల్లాసంగా మార్చి ఉత్తేజంగా ఉండేలా చేస్తుంది. నీరసం, అలసటను తగ్గిస్తుంది. ఎండు కొబ్బరిలో



సమృద్ధిగా ఉండే ఫైబర్ వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఇలా ఎండు కొబ్బరిని తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ఎంత తినాలి..?

ఎండు కొబ్బరి ఆరోగ్యకరమే అయినప్పటికీ దీన్ని రోజూ మోతాదులోనే తినాల్సి ఉంటుంది. రోజుకు 2 టేబుల్ స్పూన్ల వరకు అంటే 15 నుంచి 30 గ్రాముల మేర తినవచ్చు. దీన్ని బెల్లంతో కలిపి తింటే ఇంకా మంచిది. దీని వల్ల పోషకాలను అధికంగా పొందవచ్చు. తురిమిన ఎండుకొబ్బరిలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. కనుక ఎండు కొబ్బరిని తినదలిస్తే నేరుగా తింటేనే మంచిది. ఎండు కొబ్బరిలో శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చెబుతున్న ప్రకారం మనకు రోజుకు లభించే క్యాలరీల్లో 5 శాతం వరకు క్యాలరీలు మాత్రమే శాచురేటెడ్ కొవ్వుల ద్వారా లభించాలి. కనుక కొలెస్ట్రాల్ లేదా గుండె జబ్బులు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే ఎండు కొబ్బరిని తినాల్సి ఉంటుంది. ఎండు కొబ్బరిని ఎట్టి పరిస్థితిలోనూ చక్కెరతో కలిపి తినకూడదు.

---

# జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపునే తాగితే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

జీలకర్ర మనందరి ఇళ్లలోనూ ఉంటుంది. దీన్ని ఎంతో కాలంగా వంట ఇంటి పదార్థంగా ఉపయోగిస్తున్నారు. జీలకర్రను రోజూ మనం వంటల్లో వేస్తుంటాం. ఇది చక్కని సువాసనను కలిగి ఉంటుంది. జీలకర్రను తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే దీన్ని నేరుగా తినలేరు. కానీ జీలకర్రను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఉదయం పరగడుపునే తాగవచ్చు. రోజూ ఉదయం పరగడుపునే జీలకర్ర నీళ్లను ఒక కప్పు మోతాదులో తాగాల్సి ఉంటుంది. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. జీలకర్రలో కుమినాల్డిహైడ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. పరగడుపునే జీలకర్ర నీళ్లను తాగడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



---

## నిద్రించేటప్పుడు ఎడమ వైపు తిరిగి పడుకోవాలా..?

## కుడి వైపు తిరిగి పడుకుంటే ఏమవుతుంది..?



రాత్రి పూట నిద్రించేటప్పుడు చాలా మంది వివిధ రకాల భంగిమల్లో నిద్రిస్తుంటారు. కొందరు కేవలం వెల్లకిలా మాత్రమే పడుకుంటారు. కొందరు బోర్లా పడుకుంటారు. కొందరు మాత్రం ఏదైనా ఒక వైపు తిరిగి మాత్రమే నిద్రిస్తారు. అయితే రాత్రి పూట కేవలం ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలని, అలా నిద్రిస్తేనే మనకు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. ఆయుర్వేద కూడా ఇదే విషయాన్ని సూచిస్తుంటుంది. అయితే ఇందులో నిజం ఎంత ఉంది..? రాత్రి పూట ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలా..? కుడి వైపు తిరిగి నిద్రిస్తే ఏమవుతుంది..? వంటి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఎడమ వైపు తిరిగి నిద్రించడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**%ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే..**

ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే జీర్ణాశయం, క్లోమగ్రంథి అదే వైపు ఉంటాయి కనుక గురుత్వాకర్షణ శక్తి వల్ల జీర్ణక్రియ మరింత వేగంగా కొనసాగుతుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణాశయం నుంచి పేగుల్లోకి కదులుతుంది. దీంతో అజీర్తి, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట వంటి సమస్యలు తగ్గుతాయి. గ్యాస్ట్రో ఎసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (%+జు=ణ%) అనే సమస్య ఉన్నవారు కచ్చితంగా ఎడమ వైపు తిరిగి నిద్రించాలని వైద్యులు చెబుతుంటారు. ఎందుకంటే దీని వల్ల ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. జీర్ణాశయం ఆహారనాళం కింద ఉంటుంది. దీని వల్ల జీర్ణాశయంలోని ఆమ్లాలు తిరిగి ఆహారనాళంలోకి రాకుండా ఉంటాయి. దీంతో %+జు=ణ% నుంచి ఉపశమనం లభిస్తుంది. మాటి మాటికీ ఆహారం వల్ల త్రేన్పులు రాకుండా ఉంటాయి.

**గుండె ఆరోగ్యానికి..**

మన శరీరంలోని అతిపెద్ద రక్తనాళం అయిన అరోటా గుండెకు ఎడమ వైపు ఉంటుంది. కనుక ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే గురుత్వాకర్షణ శక్తి వల్ల శరీరానికి రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో గుండెపై పడే భారం తగ్గుతుంది. అలాగే లింఫ్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. శరీరంలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. గర్భంతో ఉన్న మహిళలు ఎడమ వైపు తిరిగి నిద్రించాలని వైద్యులు సూచిస్తుంటారు. దీని వల్ల గర్భంలో ఉన్న శిశువు భంగిమ సరిగ్గా ఉంటుంది. శిశువుకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. లివర్‌పై పడే భారం తగ్గుతుంది. తీవ్రమైన వెన్ను నొప్పి సమస్య ఉన్నవారు ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే వెన్నెముకపై పడే ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్త సరఫరా మెరుగుపడి వెన్ను నొప్పి తగ్గుతుంది.

**కుడి వైపు తిరిగితే..**

అయితే ఎడమ వైపు తిరిగి మాత్రమే నిద్రించాలా.. కుడి వైపు తిరిగి నిద్రించకూడదా.. మాకు కుడివైపు మాత్రమే బాగా అలవాటు ఉంది అనుకునేవారు తమ సౌకర్యానికి అనుగుణంగా నిద్రించవచ్చు. కుడి వైపు నిద్రించడం వల్ల ఎలాంటి హాని జరగదు. కానీ %+జు=ణ% సమస్య ఉన్నవారు, గుండె ఆరోగ్యం కోసం, గర్భిణీలు ఎడమ వైపు తిరిగి నిద్రిస్తేనే మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సౌకర్యం కన్నా ఆరోగ్య ప్రయోజనాలు ముఖ్యమని వారు అంటున్నారు. ఇక కుడి వైపు నిద్రించడం అలవాటు అయిన వారు అంత త్వరగా ఎడమ వైపును మార్చుకోలేరు. కానీ అలాంటి వారు కొన్ని రోజులు కష్టపడితే ఎడమ వైపు తిరిగి నిద్రించడం పెద్ద కష్టమేమీ కాదు. కనుక ఎడమ వైపు తిరిగి నిద్రిస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# రాయలసీమ ప్రాజెక్టుల పంటకాలువల పనులు

# జూన్--జూలైలో పూర్తి చేయాలి,

## లేకపోతే ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి.



- రాయలసీమ ప్రజా సంకల్ప తీర్మానానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మద్దతు.
- మా నీటి వాటాను మేమే సాధించుకుంటాం: ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ.
- సీమ ప్రాజెక్టులకు చట్టబద్ధమైన నీటి కేటాయింపులు జరగాలి: ప్రొఫెసర్ వెంకటేసు.
- నంద్యాలలో ఘనంగా సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ
- నాలుగు జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన రైతాంగం.

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

రాయలసీమ సాగునీటి హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ ఆదివారం నంద్యాల శివారులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఘనంగా జరిగింది. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ బహిరంగ సమాలోచన సదస్సుకు రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది రైతులు, ప్రజలు హాజరయ్యారు.

ఈ సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనివార్య కారణాల వల్ల సభకు హాజరుకాలేకపోయిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ్ ఆన్‌లైన్ ద్వారా సందేశాన్ని అందించారు. సభ ప్రారంభంలో





బొజ్జా దశరథరామిరెడ్డి రచించిన "సహజ సంపదల సిరిరా... రాయలసీమ నువ్వే మా గర్వప్రతీకరా" అనే ప్రత్యేక గీతాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ,

నందమూరి తారక రామారావు చేపట్టిన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు ఎస్ ఆర్ బి సి, తెలుగుగంగ, హెచ్ ఎన్ ఎస్ ఎస్, జి ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్టులు పూర్తి కావడానికి 40 ఏళ్లు పట్టడం, అవి ఇంకా పూర్తి కాకపోవడం భాధేస్తోందని, గోదావరి నీళ్లు బానకచర్లలో పోయడం కన్నా శ్రీశైలం ప్రాజెక్టులో ఉన్న నీళ్లు దిగువకు వదలకుండా పూర్తిగా రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయిస్తే వలసలు, కరువు పోతుందని, రైతులు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం చేస్తే సాగునీరు సాధ్యం అవుతుందని మాజీ మంత్రి వడ్డే శోభనాధీశ్వరరావు అన్నారు. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం వల్లే రాయలసీమకు కేటాయించిన సాగునీరు సద్వినియోగం కాకా దిగువన ఉన్న నాగార్జున సాగర్, పులిచింతల దాటి ప్రకాశం బ్యారేజ్ లో చేరి అక్కడి రైతు లకు ఉపయోగపడి, ఇక్కడి వాళ్లు కరువు, వలసలకు కారణం పాలకుల నిర్లక్ష్యం అధికంగా ఉందన్నారు.




వాటిని సాధించుకునేందుకు ఇప్పటికైనా రాయలసీమ రైతులు పాలకులపై వత్తిడి పెంచేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం ఉదృతం కావాలని పిలుపు నిచ్చారు. రాయలసీమలో వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు అవసరమైన లింకు పనులు, పంటకాలువల నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. "డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సీమ భూములకు చేరాల్సిన జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి జూన్--జూలై నెలల్లో ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. లేనిపక్షంలో ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలన్న ప్రజా సంకల్పానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పటికీ స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్న ప్రజాసంఘాల నిర్ణయానికి కూడా ఆయన మద్దతు ప్రకటించారు. ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ మాట్లాడుతూ, రాయలసీమ ప్రజలు తమ ఆత్మగౌరవంతో ఏకమైతేనే పాలకులు స్పందిస్తారని అన్నారు.

***"ఏళ్ల తరబడి కాలువలు పూర్తికాక, ఎకరాలకు నీరందక భూములు ఎండిపోతున్నాయి. ఇక చూస్తూ ఊరుకోలేం. అవసరమైతే మేమే పనులు ప్రారంభిస్తాం. మన ప్రాంత అభివృద్ధిని మనమే చేతుల్లోకి తీసుకుని, మన నీటి వాటాను మనమే సాధించుకోవాలి" అని పిలుపునిచ్చారు.***

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకటేసు మాట్లాడుతూ, కృష్ణా డెల్టా, ప్రకాశం బ్యారేజీకి వెళ్లే జలాల మూలం రాయలసీమలో ప్రవహించే తుంగభద్ర, కృష్ణా నదులేనని గుర్తుచేశారు. "లక్షల క్యూసెక్కుల వరద నీరు సీమ కళ్లముందే సముద్రం పాలవుతుండగా, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులకు నీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. రాయలసీమ వెనుకబాటుతనానికి ప్రధాన కారణం సాగునీటి కొరత. ఈ పరిస్థితి మారాలంటే సీమ ప్రాజెక్టులకు చట్టబద్ధమైన నీటి కేటాయింపులు జరగాలి" అని అన్నారు. రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలలో రాజకీయ పార్టీలు రాయలసీమ ప్రాజెక్టుల పూర్తి, నీటి హక్కుల సాధనపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ, సీమ హక్కుల సాధన కోసం రైతాంగమంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సభలో పాల్గొన్న రైతుల ఆమోదంతో ఆగస్టు 1న రాయలసీమ వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

**ఇతర ప్రధాన డిమాండ్లు**

నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఎ ఆర్ ఎస్ ) భూములను ఇతర అవసరాలకు కేటాయించడాన్ని నిలిపివేయాలి. కలెక్టరేట్ నిర్మాణాన్ని ప్రత్యామ్నాయ స్థలానికి మార్చాలి. రాయలసీమ నుంచి ప్రభుత్వ కార్యాలయాల తరలింపును నిలిపివేయాలి.

విజయవాడకు తరలించిన రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తిరిగి కడపకు తరలించాలి. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలి. రాయలసీమ హైకోర్టు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటి హామీలను తక్షణమే అమలు చేయాలి. ఈ డిమాండ్లపై స్థానిక ప్రజాప్రతినిధులకు త్వరలోనే వినతిపత్రాలు అందజేస్తామని, 15 నుంచి 25 రోజుల్లో సానుకూల స్పందన రాకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రజలను సంఘటితం చేస్తూ హక్కుల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాసభలో విరసం వరలక్ష్మి, జలసాధన సమితి అనంతపురం, రాయలసీమ సామాజిక వేదిక నాయకులు డాక్టర్ నాగన్న, డాక్టర్ బ్రహ్మారెడ్డి, బి కే ఎస్ సహదేవరెడ్డి, కడప, మైదుకూరు రమణ, సిపిఐ ప్రతినిధి కె.రామాంజనేయులు, రాయలసీమ విద్యావంతుల వేదిక, సిపిఐ ఎం ప్రతినిధి రాజశేఖర్, డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, డిటియఫ్ నాయకులు రత్నం ఏసేపు, వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, బాలీశ్వరరెడ్డి, బెక్కం రామసుబ్బారెడ్డి పలు ప్రజా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో కొనసాగుతున్న గంజాయి 'రాపిడ్ టెస్టులు'




మదనపల్లి, బ్యూరో చీఫ్ మే 31: పల్లె వెలుగు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఎన్‌డీపీఎస్ (ఎన్డీపీఎస్) కేసుల్లో పట్టుబడిన నిందితులకు, అనుమానితులకు అత్యాధునిక 'రాపిడ్ డ్రగ్ టెస్ట్'లను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 'డ్రగ్ డిటెక్షన్ కిట్ల' ద్వారా నిందితులు మత్తు పదార్థాలు సేవించారా లేదా అన్నది అక్కడికక్కడే నిర్ధారిస్తున్నారు. అయితే, జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించిన నిందితులందరికీ డ్రగ్స్ అలవాటు లేనట్లు 'నెగిటివ్' నివేదికలు వచ్చాయని పోలీసు అధికారులు వెల్లడించారు. మత్తు సంస్కృతికి యువత బానిస కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## వైఎస్సార్ విగ్రహ ధ్వంసం అత్యంత ఖండనీయం




కర్నూలు ప్రతినిధి,పల్లె వెలుగు నంద్యాలలోని శ్రీనివాస సెంటర్ వద్ద మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ తెలిపారు. పట్టపగలు విగ్రహంపై దాడి జరుగుతుండగా పోలీసులు అడ్డుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. అనంతరం నిందితుడి మానసిక పరిస్థితిపై వివరణలు ఇవ్వడం కంటే, చట్టపరమైన చర్యలు తీసుకోవడం పోలీసు యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విగ్రహాలపై వరుస దాడులు జరగడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న వ్యక్తులు, శక్తులను గుర్తించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన విగ్రహం స్థానంలో తక్షణమే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలో ప్రజా ఉద్యమాలతో పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## నైతిక విలువలు, వృత్తి నైపుణ్యాలతోనే జర్నలిజానికి విశ్వసనీయత..!

- రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్
- రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరుల రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం

కడప, బ్యూరో చీఫ్ మే 31 పల్లె వెలుగు జర్నలిజంలో నైతిక విలువలు, వృత్తి నైపుణ్యం, ఖచ్చితత్వం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవడం ద్వారానే మీడియా పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహించిన రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మీడియా స్వేచ్ఛ అనేది బాధ్యతతో కూడుకున్నదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు వాస్తవాధారిత వార్తలను మాత్రమే ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల వ్యక్తులకు, సంస్థలకు, సమాజానికి నష్టం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు.



స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు పత్రికలు కీలక పాత్ర పోషించాయని, అనంతరం ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన వేదికగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే కాలక్రమేణా మీడియా రంగంలో పెరిగిన పోటీ, వాణిజ్య ధోరణులు, పక్షపాత వైఖరులు జర్నలిజం విలువలను దెబ్బతీసే పరిస్థితులను తీసుకువచ్చాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో నిష్పాక్షికత, నిజాయితీ, ప్రజాహితం వంటి మూల సూత్రాలను జర్నలిస్టులు మరింత బలంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

సోషల్ మీడియా ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి సమాచారాన్ని వార్తగా పరిగణించకుండా దాని నిజానిజాలను నిర్ధారించిన తర్వాతే ప్రచారం చేయాలని సూచించారు. జర్నలిస్టుల స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి బలం అయినప్పటికీ, ఆ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కడప జిల్లా జర్నలిస్టులు చురుకుగా పాల్గొని వివిధ అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధి కోసం మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం.. రెండు రోజుల పునశ్చరణ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జర్నలిస్టులకు రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ తరపున చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ చేతుల మీదుగా జర్నలిజంపై అవగాహన పెంచే పుస్తకాల బ్యాగు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడి పద్మజ, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు, జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు తదితర మీడియా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కర్నూలు పల్లె వెలుగు బ్యూరో...



కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ మరియు వృద్ధులకు బియ్యము, పెన్షన్ మరియు కైకలూరు రూరల్ ఆర్టీ జాన్స్ క్లస్టర్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది కైకలూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తుపాకుల సోమాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు కైకలూరు ఎమ్మెల్యే గౌరవనీయులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే మరియు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ , విద్యార్థులకు నోటు పుస్తకాలను వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి రావు , మార్కెట్ యార్డ్ చైర్మన్ పెన్మత్స త్రినాధ రాజు , విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మోదేపల్లి నాగు , ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ అప్పలబత్తుల శివకేశవ , ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ పట్నాల శేషగిరిరావు , పశ్చిమ గోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నక్కా చైతన్య శ్రీనివాస్ , డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ ఫోరం ఫర్ డెమోక్రసి ఏపీ కన్వీనర్,తదితరులు పాల్గొనడం జరిగింది...